ప్రయాణం.. బురదమయం

● దారుణంగా మారిన దుద్యాల్–అల్లిఖాన్‌పల్లి రోడ్డు
● తీవ్ర అవస్థలు పడుతున్న విద్యార్థులు, గ్రామస్తులు


కల్వర్టు వద్ద రోడ్డు దుస్థితి


రహదారి మధ్యలో ప్రమాదకరంగా గుంత

దుద్యాల్: మండల కేంద్రం నుంచి అల్లిఖాన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో వర్షం పడినప్పుడు పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలోనే రోడ్డు దారుణంగా తయారు కావడంతో మరమ్మతుగా సొడు మట్టి పోయడంతో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారి సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. దాదాపు మూడు కిలో మీటర్లు నరకప్రాయంగా ఉంది. మండల కేంద్రానికి రావడానికి ఉన్న ఏకైక దారి బురదమయం కావడంతో నిత్యం వివిధ కార్యకలాపాల కోసం వచ్చే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని అల్లిఖాన్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

చినుకులు పడితే అంతే..

వర్షం పడితే చాలు అల్లిఖాన్‌పల్లి–దుద్యాల్ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి వాహనాల రాకపోకలు స్తంభించిపోయి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గైర్హాజరు అవుతున్నారు. వర్షాలు ఆగిపోయినా దాదాపు నాలుగు నుంచి ఆరు రోజుల వరకు దారి బురదగా మారడంతో కాలి నడకకు కూడా ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఇటు విద్యార్థులు.. అటు గ్రామస్తులు కోరుతున్నారు.

“ వర్షమొస్తే తిప్పలే..



దుద్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నిత్యం అల్లిఖాన్‌పల్లి నుంచి దుద్యాల్‌కు కాలినడకన లేదా ఇతర వాహనాలతో పాఠశాలకు వెళ్తుంటాను. రెండు గ్రామాల మధ్య రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. వర్షం పడితే పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వర్షం ఆగిన ఐదు రోజుల వరకు బడికి వెళ్లలేని దుస్థితి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– రేణుక, 8వ తరగతి, అల్లిఖాన్‌పల్లి

సస్యరక్షణ చర్యలు పాటించండి

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన


పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బషీరాబాద్: అధిక వర్షాలు, చీడపీడల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తల బృందం ప్రతినిధి డాక్టర్ ఆర్.రాంగోపాల్ వర్మ సూచించారు. సోమవారం మండలంలోని కాశింపూర్, నావంద్గీ, క్యాద్గీరా, కొర్విచెడ్, యాలాల మండలంలోని చెన్నారం, విశ్వనాథ్‌పూర్, యాలాల గ్రామాల్లో పత్తి, వరి, కంది పంటలలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.చంద్రమోహన్, డాక్టర్ టి.కిరణ్ బాబు, కోఆర్డినేటర్ టి.లక్ష్మణ్, యమునా, ఏడీ రుద్రమూర్తి మాట్లాడుతూ.. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకుముడుత పురుగును గమనించినట్లు చెప్పారు. వీటి నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు, లేదా క్లోరాం ట్రనిలిప్రోల్ 0.3 మి.లీ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు చుట్టూ తడిచేలా వేయాలన్నారు. ముఖ్యంగా పత్తి పంటలో పచ్చ దోమ, వడలు తెగులు ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వర్షపాతం తగ్గిన అనంతరం పొలంలో నీరు నిలువ ఉండకుండా మురుగు నీటిని తొలగించి, ఆ తర్వాత 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో బషీరాబాద్, యాలాల మండల ఏఓ సూర్యప్రకాశ్, నవీన్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు


బంట్వారం: నీటి సహాయకులకు సూచనలు చేస్తున్న ట్రైనర్ ఫయాజ్

దోమ: గ్రామీణ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రావొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహేశ్‌బాబుతో కలిసి నీటి సరఫరా విభాగంపై మల్టీపర్పస్ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నీటి ప్రాముఖ్యతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చల్మారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్, ఎంపీఓ సోమలింగం, మల్టీపర్పస్ వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: గ్రామీణ మంచి నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ నీటి సరఫరా సహాయకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ఫయాజ్ సహాయకులకు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణా తరగతులు 4వ తేదీ వరకు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఏఈ వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మంచి నీటి సహాయకులు పాల్గొన్నారు.

న్యాస్ ఫలితాల్లో జిల్లా ముందుండాలి

రాష్ట్ర పరిశీలకుడు ఎండీ యాసిన్


న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు ఎండీ యాసిన్

మర్పల్లి: న్యాస్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చి ముందుండాలని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే రాష్ట్ర పరిశీలకుడు ఎండీ యాసిన్ ఆకాంక్షించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విధానాన్ని ఆయన పరిశీలించారు. కాలనుగుణంగా విద్యార్థులకు బోధనాభ్యాసంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు డిజిటల్ మాధ్యమంలో విద్యాబోధన చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ముస్తారామ్, ఎంఈఓ అంజిలయ్య తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బషీరాబాద్: పోషణ మాసంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

బషీరాబాద్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని బషీరాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా సోమవారం పౌష్టిక ఆహార పదార్థాలను, బాలామృతంతో చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. గర్భిణులు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యకరమైన పిల్లలు జన్మనిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణి, శోభరాణి, వాణిశ్రీ, మొగులమ్మ, సుకన్య, కావేరి, రమాదేవి, అన్నపూర్ణ, రత్నమాల పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: బాలింత, శిశువులకు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. సోమవారం మండల పరిధిలోని ఏర్పుమళ్లలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార పదార్థాలు, ఆహారం తయారు చేసుకునే విధానం గురించి వివరించారు. పోషకాహార లోపం వల్ల జరిగే అనర్థాలను వివరించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత


గుర్తింపు పత్రాలు అందుకున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా ఉమెన్ అండ్ ఏఐ కార్యక్రమం ద్వారా 110 మంది విద్యార్థినులకు ఎక్సెల్, డేటా మోడలింగ్, డేటా విజువలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర కోర్సులలో శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం శిక్షణ పొందిన విద్యార్థినులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌కుమార్ గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు హరిప్రియ, అన్నపూర్ణ, స్వప్న, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సోనుసూద్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేత



అనంతగిరి: ప్రముఖ సినీనటుడు సోనుసూద్‌ను వికారాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు రాజేందర్‌గౌడ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌గౌడ్ పూడూర్ మండలంలోని దామగుండం అడవిలో నేవీ రాడార్ ఏర్పాటు వద్దనే విషయంలో జరుగుతున్న ఉద్యమం గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో తమకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో రామన్న, వెంకటయ్య, గీతా, మహేందర్, చైతన్య కిరణ్ తదితరులున్నారు.

కళాశాలలో బతుకమ్మ వేడుకలు


ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బతుకమ్మలతో అధ్యాపక సిబ్బంది

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక, తెలుగు కదలిక సాహిత్య పరిషత్ ఉమెన్స్ ఆధ్వర్యంలో చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఫియాఖనమ్, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎంఈఓగా అబ్దుల్ రెహమాన్**

నవాబుపేట: నవాబుపేట మండల విద్యాధికారిగా చిట్టిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ రెహమాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు నవాబుపేట ఇన్‌చార్జి విద్యాధికారిగా పని చేసిన గోపాల్ వికారాబాద్ మండలం కిషన్‌నాయక్ తండాకు బదిలీపై వెళ్లారు.

◆ **విద్యతోనే దేశాభివృద్ధి**



యాలాల: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏకలవ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పగిడియాల ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రాజెక్టు వర్కుల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు బస్వరాజ్ మాట్లాడుతూ.. విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

◆ **దరఖాస్తులు నిల్**

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆయా శాఖల అధికారులు మీటింగ్ హాల్‌లో వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించ లేదు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి మండలాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేసేందుకు వెళితే ఇబ్బందులు కలుగుతాయనే ఉద్దేశంతో గత కొంత కాలం నుంచి మండల కేంద్రాల్లోనే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

◆ **స్వచ్ఛతతో మెరుగైన ఆరోగ్యం**

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణలో భాగంగా స్వచ్ఛతను పాటించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ముజాహిద్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించి ప్రతిభచాటిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రోజూ భోజనం చేసే సమయం, మలవిసర్జన చేసిన అనంతరం చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి, స్థానిక ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

◆ **నాణ్యమైన విద్యనందించాలి**

పెద్దేముల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలని పెద్దేముల్ మండల విద్యాధికారి నర్సింగ్‌రావు అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల గోట్లపల్లి, గాజీపూర్ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరిగే న్యాస్ మాక్ పరీక్ష–2ను పరిశీలించారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు సెలవు పెట్టినా, ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఉండాలన్నారు.

◆ **సమయపాలన ముఖ్యం**

పెద్దేముల్: మండల కేంద్రంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ జర్నప్ప అన్నారు. సమయపాలన పాటించని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణికి వ్యవసాయ, విద్యుత్, అంగన్‌వాడీతో పాటు పలు శాఖల అధికారులు ఆలస్యంగా రావడంతో ఎంపీడీఓ మండి పడ్డారు.

◆ **రేపు సేవాలాల్ కమిటీ సమావేశం**

కొడంగల్: సేవాలాల్ కమిటీ సభ్యులు సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పట్టణ శివారులో నిర్మిస్తున్న బంజారా భవన్ సేవాలాల్ గుడి, అభివృద్ధి పనుల గురించి సమావేశం ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ సేవాలాల్ మహారాజ్ సేవా సంఘం సభ్యులు తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. సేవాలాల్ కమిటీ సభ్యులతో పాటు నియోజకవర్గంలోని 8 మండలాల్లో ఉన్న ప్రతి తండా నుంచి గిరిజన సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ **పరిసరాల శుభ్రతపై అవగాహన**

మోమిన్‌పేట: ప్రతిఒక్కరూ స్వచ్ఛతపై స్పందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తన పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 4 దరఖాస్తులు

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

◆ **పాఠశాలల పరిశీలన**

బొంరాస్‌పేట: మండలంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమష్టి కృషితో విద్యా ప్రగతిని ఆవిష్కరిద్దామని నూతన ఎంఈఓ హరిలాల్ అన్నారు. ఎంఈఓ బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం మొదటిసారి మండలంలోని పలు పాఠశాలలను ఎంఈఓ సందర్శించారు. నాందార్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాల, సీపీఎస్ చౌదర్‌పల్లి, జెడ్పీహెచ్‌ఎస్ చౌదర్‌పల్లి పాఠశాలలను ఆయన పరిశీలించారు.

సేవలు అభినందనీయం



బొంరాస్‌పేట: స్వచ్ఛంద సేవా సంస్థలు అందించే సేవలు అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో అంకిత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల రహిత సమాజాన్ని నిర్మిద్దాం


పెద్దేముల్: పాషాపూర్‌లో పౌర హక్కులపై మాట్లాడుతున్న ఎస్ఐ గిరి


కుల్కచర్ల: చాపలగూడెంలో హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


బొంరాస్‌పేట: గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ ఎండీ రవూఫ్

పెద్దేముల్ ఎస్ఐ గిరి

పెద్దేముల్: కుల వివక్ష లేని సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పెద్దేముల్ ఎస్ఐ గిరి సూచించారు. సోమవారం మండలంలోని పాషాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మానవ హక్కుల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సదుపాయాలు, ప్రభుత్వ గృహాల గురించి వివరించారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి అవలంబిస్తే చర్యలు తీసుకోవటంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలలతో వెట్టిచాకిరీ చేయిస్తే చట్టరీత్యా చర్యలుంటాయన్నారు. గ్రామంలో అందరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సీమెన్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ తమకు రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను పొందే అవకాశం ఉందని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్, ఎస్ఐ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చాపలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవించడానికి అవసరమైన హక్కులను భారత ప్రభుత్వం కల్పించిందన్నారు. అందరూ చట్టాలు, ప్రభుత్వ నియమనిబంధనలపై అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాజా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: రాజ్యాంగ బద్ధంగా కల్పించిన పౌర హక్కులను కాపాడాలని ఎస్సై ఎండీ రవూఫ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని కొత్తూరులో ఆయన పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. ఈ మేరకు రచ్చకట్ట వద్ద సమావేశం నిర్వహించి హక్కులు, చట్టాలను వివరించారు. పోలీసులకు సహకరించాలన్నారు. చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలన్నారు. ఈమేరకు ఎస్సై గ్రామ పౌరులతో ప్రతిజ్ఞ చేయించారు.

పౌరులందరూ సమానం

తాండూరు రూరల్: గ్రామాల్లో కుల వివక్ష లేకుండా అందరినీ సమానంగా చూడాలని పౌరహక్కుల అధికారి గోవింద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసమే పౌర హక్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పవన్‌కుమార్, రెవెన్యూ అధికారి బాబులు ఉన్నారు.

యాలాలలో..

యాలాల: పౌర హక్కులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని యాలాల ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కమాల్‌పూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులందరికీ హక్కులు కల్పించిందన్నారు. హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: సమాజంలో అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించాలని మర్పల్లి ఏఎస్ఐ వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొంషెట్‌పల్లి గ్రామంలో ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ తుల్జారామ్‌గౌడ్‌తో కలిసి ఆయన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

మాకు రహదారి కల్పించండి

తహసీల్దార్‌కు ఎస్సీ కాలనీవాసుల వినతి


తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

పెద్దేముల్: మండల కేంద్రంలో ఎస్సీ కాలనీకి దారి కల్పించాలంటూ సోమవారం పెద్దేముల్ గ్రామ ఎస్సీ వార్డు ప్రజలు తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందచేశారు. గతేడాది నుంచి కొత్త ఎస్సీ కాలనీ పక్కన రోడ్డు లేక ఇతర వార్డుల నుంచి రావడం జరుగుతుందన్నారు. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ కూడా రావడం లేదని గ్రామానికి చెందిన కోటపల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బుజ్జమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంటప్ప, రాంచంద్రం, సమ్మప్ప, ఏసప్ప తదితరులు తహసీల్దార్‌కు విన్నవించారు. వాటర్ ఫీల్టర్ పక్క నుంచి రోడ్డు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

తపస్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: ఉపాధ్యాయ యూనియన్ తపస్ దుద్యాల్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, అధ్యక్షుడిగా శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా తేజస్విని, ఉపాధ్యక్షుడిగా అశోక్ కుమార్, కార్యదర్శిగా అంజిలయ్య, కోశాధికారిగా దిలీప్ కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేందర్ బహదూర్, వెంకటయ్య, బాకారం మల్లయ్య, మండలానికి చెందిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వృద్ధులకు అండగా ఉంటాం

అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మి


అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు ఆశీర్వాదం ఇస్తున్న వృద్ధులు

తాండూరు రూరల్: మహిళ శిశు సంక్షేమ శాఖ తరఫున వయో వృద్ధులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులకు ఏవైన సమస్యలు ఉంటే 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వయోవృద్ధులు సమాజంలో ఎవరిపైన ఆధారపడకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న చిన్నారులకు వృద్ధుల నుంచి ఆశీర్వాదం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చేసిన సేవలే పదిలం


శరభలింగంను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అనంతగిరి: విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ అన్నారు. ఈమేరకు వికారాబాద్ మున్సిపల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన శరభలింగం పదవీ విరమణ సోమవారం మున్సిపల్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శరభలింగం మొదటి, చివరి పోస్టింగ్ వికారాబాద్‌లోనే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ సురేష్, మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, నాయకులు రాంనివాస్‌రాతి, రమేష్ గౌడ్, టౌన్‌ప్లానింగ్ అధికారి వేణుగోపాల్, డీఈ రాకేష్‌రెడ్డి, ఎన్జీవోస్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తోడ్పాటు

మర్పల్లి: మండల కేంద్రానికి చెందిన కర్నే నర్సింలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బాల్య స్నేహితులు (పదో తరగతి బ్యాచ్) సోమవారం ఇంటికి వెళ్లి రూ.21 వేల ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. భవిష్యత్‌లో నర్సింలు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.